

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా






సంపుటి - 07 | సంచిక 218 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 08, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# కష్టపడ్డోళ్లు.. రోడ్డు పడ్డారు!







డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

పార్టీ జెండా మోసనోళ్లు పనికిరాకుండా పోతున్నారు

కాంగ్రెస్ పార్టీలో వలసవాదుల సంఖ్య విచ్చలవిడిగా పెరిగిపోయింది

నిజాయితీ కార్యకర్తలు నామరూపం లేకుండా పోతున్నారు

కాంగ్రెస్ పార్టీ కాస్త టీడీపీ పార్టీగా మారిపోతుందా ! ?

అవకాశవాద రాజకీయాలు ఇంకెంతకాలం

రేవంతన్నా మా బతుకేందంటూ గోడు విలపిస్తున్న కాంగ్రెస్ నేతలు

అవకాశాల కోసం కాకుండా ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీలో ఉంటున్నారు

వ్యాపారాలకు డోకా లేనోళ్లే పార్టీలు మారుతున్నారు

భూకబ్జాలు చేసే వాళ్లే ఎమ్మెల్యేలతో, మంత్రులతో తిరుగుతున్నారు

అధికారం ఎక్కడ ఉంటే అవకాశవాదులు అక్కడే వాలిపోతున్నారు

డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

అవకాశవాద రాజకీయాలు అంతరించబడితే తప్ప ప్రస్తుత రాజకీయాలకు విలువలు దక్కేలా లేదని డాక్టర్ బరిగెల శివ స్పష్టం చేశారు.రాష్ట్ర రాజకీయాల పట్ల ప్రజలకు పెద్ద ఎత్తున విశ్వాసం సన్నగిల్లుతుందని పేర్కొన్నారు.పార్టీలకు అధికంగా నడిపించబడాల్సిన రాజకీయాలు వలసవాదుల చేరికలతో పార్టీల రూపురేఖలు మార్చేయబడుతున్నాయని తీవ్రంగా విమర్శించారు.కేవలం అధికార పార్టీలను ఆసరాగా చేసుకుని మాత్రమే రాజకీయాల్లో కొనసాగే వ్యక్తులు లక్షల్లో పెరిగిపోతున్నారని హెచ్చరించారు.ప్రభుత్వ పార్టీలో చేరిపోతే రాజకీయ పలుకుబడితో వ్యక్తిగత ఆటంకాలనన్నింటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో రాజకీయాల మార్పు తధ్యమని భావించుకుంటున్నారని పార్టీలు మారిన వలసవాదులు అధికారం యాడ ఉంటే ఆడనే తిష్ట వేస్తూ రాజకీయాలను కుళ్లిపోయేలా చేస్తున్నారని ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున చిదరించుకుంటున్నాయని తెలిపారు.ప్రజల హక్కులను కాపాడాల్సిన రాజకీయ నాయకులు పార్టీ ఫిరాయింపులతో పార్టీలలో చేరిపోయిన వ్యక్తులతో పైసా వ్యాపారాలకు భూకబ్జాల వ్యాపారాలకు నకిలీ వ్యాపారాలకు పాల్పడుతున్నారని వాటన్నిటిని రహస్య ఒప్పందాలతో కొనసాగిస్తూ వాటి ద్వారా రాజకీయంగా ఖర్చు పెట్టుకున్న డబ్బును తిరిగి సంపాదించుకోవడంతోపాటు రానున్న రాజకీయాల్లో పోటీలో నిలవడం కోసం కావలసినంత సొమ్మును పోగు చేసుకుంటున్నారని నిలదీశారు.రాజకీయ వలసవాదులు ఎలాంటి వ్యక్తిత్వ రాజకీయ వ్యతిరేక స్వభావం కలిగిన వారైనా ఏమాత్రం సంబంధం లేని విధంగా ప్రధాన నాయకులందరూ

- మిగతా 2లో..

## ప్రజాసేవకు ప్రతిరూపం డిఐజి విజయ్ రావు ఐపిఎస్

పోలీస్ వృత్తిలో మార్గదర్శకత్వాన్ని కనపరుస్తున్నారు

ఆత్మీయ బంధాలకు చిరునామా... సేవాస్ఫూర్తికి ప్రతిరూపం... డీఐజీ విజయ్ రావు ఐపీఎస్

పేద ప్రజలు అంటే తనకు అమితమైన ప్రాణం

అధికారంలో ఎంతో ఎత్తున ఉన్న ప్రజాసేవను పక్కాగా అమలు పరుస్తున్నారు

ప్రజాసేవకు చిరునామా డిఐజి విజయ్ రావు ఐపీఎస్

డాక్టర్ బరిగెల శివ జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్



3

## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

కెసిఆర్ సరేనంటే..ఎంత సమయమైనా కేటాయిస్తాం

కెసిఆర్ వాదన సరైనదయితే ..ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం

కాళేశ్వరం కమిషన్ల ప్రాజెక్ట్ అన్న సిఎం రేవంత్ రెడ్డి

నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు

కెటిఆర్, హరీష్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని విమర్శలు

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సిఎం రేవంత్ విమర్శలు



6

## పోలీసులకు నైపుణ్యమే బలం

విధుల్లో ప్రతిభ కనబర్చాలంటే నిరంతర శిక్షణ అవసరమన్న సీపీ ఎన్. శ్వేత

వరంగల్‌లో భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌కు ఘన ప్రారంభం

నాలుగు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనడం

సాంకేతిక, ఫోరెన్సిక్ విభాగాల్లో నైపుణ్యాల ప్రదర్శన

రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు ఉత్తమ ప్రతిభావంతుల ఎంపిక



7

## నూతన సిపికి ఘన స్వాగతం

సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పీటిసి ప్రిన్సిపాల్ కె రమేష్

వరంగల్ పోలీస్ శాఖలో నూతన ఉత్సాహం



**వరంగల్ పోలీస్ శాఖ జై భీమ్ న్యూస్:-**

వరంగల్ పోలీస్ శాఖలో నూతనమైన ఉత్తేజం ఏర్పడిందని పీటిసి ప్రిన్సిపాల్ కె రమేష్ తెలిపారు.వరంగల్ మహానగరంలో మొట్టమొదటి మహిళా పోలీస్ ఐపీఎస్ అధికారిగా బాధ్య తలు చేపట్టిన సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ ను సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా తను స్పందిస్తూ వరంగల్ ప్రజలు అత్యంత అదృష్టవంతులని సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ రూపంలో వరంగల్ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించబడబోతున్నాయని గర్వంగా చెబుతున్నామన్నారు. పిటిసి బలోపేతానికి పోలీస్ కమిషనర్ సూచనలు సలహాలు ఉన్నత స్థాయిలో పాటిస్తానని హామీ ఇచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV

# కకూన్ ఉత్పత్తిపై పరిశోధనకు డా. ఎస్. శ్యామల దేవికి డాక్టరేట్

**వరంగల్, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



అర్థశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకురాలు డా. ఎస్. శ్యామల దేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. డా. ఎస్. శ్యామల దేవి "ఎంప్లాయిమెంట్ అండ్ ఇన్కమ్ జనరేషన్ ఇన్ కోకోన్ ప్రొడక్షన్ -- ఏ స్టడీ (కకూన్ ఉత్పత్తిలో ఉపాధి, ఆదాయ సృష్టి -- ఒక అధ్యయనం) అనే అంశంపై అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి. సురేష్ లాల్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పట్టు పరిశ్రమలో కకూన్ ఉత్పత్తి ద్వారా ఉపాధి అవకాశాలు, ఆదాయ వృద్ధి, గ్రామీణ ఆర్థికాభివృద్ధిపై ఈ పరిశోధన దృష్టి సారించింది. ఖమ్మం జిల్లాకు చెందిన డా. ఎస్. శ్యామల దేవి ప్రస్తుతం లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. విద్యా, పరిశోధనా రంగాల్లో ఆమె చేస్తున్న కృషికి డాక్టరేట్ లభించడం పట్ల పలువురు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డా. ఎస్. శ్యామల దేవిని అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విలువైన పరిశోధనలు చేసి విద్యా రంగానికి విశిష్ట సేవలందించాలని ఆకాంక్షించారు.

# ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముందు కేయూ ఉద్యమ నాయకత్వం వినతి

**కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించిన డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి**



**హైద్రాబాద్, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ఉన్నతస్థాయి కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని అమర జ్యోతి సెంటర్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మాజీ కాకతీయ విశ్వవిద్యాలయ జేఏసీ (కేయూజేఏసీ) వరంగల్ కన్వీనర్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి, మాజీ ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకత్వం తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు సీనియర్ ఉద్యమ నాయకులు, విద్యార్థి నాయకులు, ఉద్యమ కార్యకర్తలతో కలిసి కమిటీకి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామ్య విద్యార్థి-యువజన సంఘాలు పోషించిన కీలక పాత్రను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసి, ఉద్యమంలో అనేక త్యాగాలు చేసిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, అధికారిక గుర్తింపు, న్యాయం కల్పించాలని డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కమిటీని కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రధాన ఉద్యమ కేంద్రంగా నిలిచిందని, అక్కడి విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాల పోరాటం రాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైందని ఆయన పేర్కొన్నారు. ఉద్యమంలో విశేష సేవలందించిన ప్రతి నిజమైన ఉద్యమకారుడికి ప్రభుత్వం సముచిత గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యమ వారసత్వాన్ని, ఉద్యమకారుల త్యాగాలను గుర్తిస్తూ పారదర్శకంగా గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని కమిటీని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు ఉద్యమ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు, ఉద్యమ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శైలజా రామయ్యర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

**అటవీ, పర్యావరణ శాఖల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచనలు**

**హైద్రాబాద్, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



పర్యావరణ, అటవీశాఖల నూతన ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ శైలజా రామయ్యర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ఆమె నాయకత్వంలో అటవీ, పర్యావరణ శాఖలు మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, వన మహోత్సవం, వన్యప్రాణులు, జీవవైవిధ్య సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, అడవుల పరిరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి సూచించారు. అలాగే అటవీ, పర్యావరణ శాఖలను మరింత బలోపేతం చేసే దిశగా దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో ప్రస్తుతం అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మధ్య సంక్షిప్తంగా చర్చ జరిగింది.

# కష్టపడ్డోళ్లు రోడ్డున పడ్డారు

మొదటి పేజీ తరువాయి

కరుడుగట్టిన నేరస్తులను కరుడుగట్టిన భూకబ్జాదారులను పార్టీలోనికి ఆహ్వానిస్తూ సామాన్య కార్యకర్తల ఉసురు పోసుకుంటున్నారని హెచ్చరించారు.

**జండా మోసినోని జాడెక్కడ..**

**పైన సంపాదనే రాజకీయవాదమా.....**

రాజకీయాలను రాజకీయ పార్టీలను ప్రజల మధ్యలో పలుచన చేయడం కోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రధాన నేతలు అధికార పార్టీలోకి చేరిపోయి అధికారికంగా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల మధ్యలో జరుగు ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికార పార్టీ తరఫున నిలబడుతూనే రాజకీయంగా పార్టీ మారలేదంటూ పైగా అభివృద్ధి కోసం అధికార పార్టీతో కలిసి పని చేస్తున్నామని కిరాతకంగా మాట్లాడడం రాజకీయ ద్రోహం లాంటిదని భావించాల్సి ఉంటుందన్నారు.రాజకీయాల్లో నిజాయితీని నిష్పక్షపాతాన్ని ప్రదర్శించడం కోసం ఒకే పార్టీ ఒకే జెండా ఒకే రాజకీయ జీవితం అనే సూత్రాన్ని పాటిస్తూ ప్రజాసేవకు కట్టుబడి ఉండాల్సిన నాయకులందరూ స్వార్థపూరిత రాజకీయాలను పెంపొందించడం కోసం కరుడుగట్టిన, కుట్రపూరితమైన రాజకీయ పరిపక్వతను కనపరుస్తూ రాజకీయ వ్యతిరేక శక్తులను ప్రేరేపించే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.ప్రతి పార్టీలో నిస్వార్థంగా జెండాలు పట్టి పార్టీ ప్రభావం కోసం పార్టీ బలోపేతం కోసం పనిచేసిన నాయకులందరూ కార్యకర్తలు అందరూ తీవ్రమైన నిరుత్సాహానికి లోనయ్యారన్నది మాత్రం 100 శాతం నిజం అన్నారు.రాష్ట్ర ప్రజలకు సేవ చేయడం కన్నా వ్యాపారాలను పెంపొందించుకోవడం కోసం మాత్రమే పలువురు ప్రధాన రాజకీయ నేతలతో పాటు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు పార్టీలు మారిన వ్యక్తులతో రాజకీయ వ్యాపారాలు చేస్తూ అధికార పార్టీలో అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన విమర్శలు ఏర్పడ్డాయన్నారు.కాయ కష్టం చేసుకొని సాదారణన కార్యకర్త నుండి ద్వితీయ శ్రేణి నాయకుల వరకు ఎదిగిన కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీలకు చెందిన వాళ్ల వాళ్ల స్థానిక నేతలు అంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో తీవ్రమైన మనస్థాపానికి గురయ్యారని అదే క్రమంలో గత పది సంవత్సరాలుగా రాజకీయ అధికార పదవులను అంటిపెట్టుకొని జీవించి బిఆర్ఎస్ పార్టీ ఓడిపోగానే ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీలో చేరి అదే రాజకీయాలను నేడు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉనికిని పూర్తిగా దెబ్బతీస్తున్నారని అన్నారు.బూత్ లెవెల్ కమిటీల కార్యకర్తల నుండి డివిజన్ లెవెల్ కార్యకర్తలు,గ్రామస్థాయి కార్యకర్తల నుండి మండల స్థాయి కార్యకర్తల వరకు ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లోనవ్వకుండా గడిచిన 10 సంవత్సరాలు తీవ్రమైన ఇబ్బందులు పడి గత ప్రభుత్వ పెట్టిన ఇబ్బందులను ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన నాయకులందరూ ప్రస్తుత ప్రభుత్వ హాయంలో మరుగున పడ్డారని నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు మనోవేదన చెందుతుండగా అదే స్థాయిలో బీఆర్ఎస్ బిజెపి ఇతర పార్టీలలో అధికార పదవులను అనుభవించిన రాజకీయ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను నిజాయితీగా జెండా మోసిన నాయకులను తీవ్రంగా అణిచివేతకు గురిచేస్తూ రాజకీయ పదవులకే అర్థం లేకుండా చేస్తున్నారని వాపోయారు.ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోనికి వచ్చిన ప్రధాన నేతలంతా వేలకోట్ల వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయ సేవను మర్చిపోయి కొంతమంది మంత్రి పదవులు హోదాలలో కొంతమంది అధికార పదవులు హోదాలలో ప్రభుత్వ అధికారాన్ని వ్యక్తిగతనికి వాడుకుంటున్నారని ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున విమర్శిస్తుండగా దానికి తోడుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నిజమైన కార్యకర్తలు నిజమైన నాయకులు సంవత్సరాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రధాన నేతలంతా వలసవాదుల రాజకీయాలతో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొన్నిచోట్ల కాంగ్రెస్ పార్టీ పూర్తిగా టిడిపి మయం అవుతున్నట్లుగా రాష్ట్ర రాజకీయాల ప్రభావం ప్రజల మీద బలవంతపు రాజకీయాలను చేస్తున్నట్లుగా ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు భావిస్తున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీని గెలిపించిన నాయకులు కార్యకర్తలు పార్టీలో వాళ్లకు లభించాల్సిన గుర్తింపు వాళ్లకు దక్కాల్సిన సముచిత స్థానాలన్నీ పక్క పార్టీ వాళ్లు వలసవాదులు అనుభవిస్తుంటే చూసి తట్టుకోలేక మనోవేదనకు గురవడమే కాకుండా మానసిక క్షోభను అనుభవిస్తున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు కనీస గుర్తింపు లభించడం లేదని కాంగ్రెస్ పార్టీని వదిలి వేరే పార్టీకి వెళ్లలేక ఎంతో వేదన పడుతున్నారని పార్టీ జెండా మోసినందుకు తగిన గుణపాఠం జరిగిందని భావిస్తున్న నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు లక్షల్లో ఉన్నారన్నది కాంగ్రెస్ పార్టీ మర్చిపోవద్దన్నారు.యువత నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి పార్టీని గెలిపించుకోగా రాష్ట్రంలో ఒకవైపు నిరుద్యోగ యువత విపరీతంగా పెరిగిపోతుండగా యువత చెడు మార్గాల్లో నడుచుకుంటున్నారని తెలియజేస్తూ రాజకీయ పరిపాలన విధానంలో సమూలమైన మార్పులు రాకపోతే కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో కష్టకాలం తప్పదని గుర్తు చేశారు.ప్రభుత్వం ఏం చేసినా ప్రజలు అడగడానికి లేదని చివరకు సొంత కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రశ్నించకూడదని ఇతర పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్న సందర్భంలో మాత్రం కార్యకర్తల అవసరం, నాయకుల అవసరం ఉపయోగించుకుంటున్నారని తెలంగాణ ప్రజలు క్షేత్రస్థాయిలో పసిగడుతున్నారని గుర్తించాలన్నారు.కనీసం నామినేటెడ్ పదవుల్లోనైనా ఉన్నత చదువులు చదువుకొని 30 నుండి 40 సంవత్సరాల వరకు కాంగ్రెస్ జెండాను ప్రాణంగా పట్టుకొని మోసిన నాయకులకు ప్రభుత్వం ఏర్పడ్డాక ఏమైనా అవకాశాలు లభిస్తాయేమోనని ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సందర్భంలో ఇతర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి వాళ్లకు రావాల్సిన అవకాశాలను రానివ్వకుండా చేస్తుండగా,నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల పదవులకు అడ్డుపడుతూ రాజకీయ పదవుల్లో నామినేటెడ్ పదవుల్లో తెగ పైరవీలు చేసుకుంటూ పార్టీలు మారినోల్లే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను వివిధ ప్రలోభాలకు లొంగదీసుకుంటూ రాజకీయపబ్బం గడుపుకుంటున్నారని అలాంటప్పుడు నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నిజమైన కాంగ్రెస్ నాయకులకు న్యాయం జరగడం సాధ్యమేనా అంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్రమైన చర్చ నడుస్తుందని గుర్తుచేశారు.ప్రతి నాయకుడు వ్యక్తిగత శ్రద్ధతో పని చేసినట్లయితే కార్యకర్తలకు ఇంతలా ఇబ్బందులు ఎందుకు కలుగుతాయి అంటూ గుర్తు చేశారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలనే కాకుండా ఇతర పార్టీ కార్యకర్తలను కూడా తన సొంత కార్యకర్తల్లాగా కాపాడుకుంటూ రాజకీయ వైరుధ్యాలకు తావివ్వకుండా రాజకీయ భేదాభిప్రాయాలకు తావివ్వకుండా ఇతర పార్టీ నాయకులకు సేవలు చేయకూడదనే భావన లేకుండా తన చెంతకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడమే కాకుండా తన వ్యక్తిగతంగా సంపాదించుకున్న లక్షలాది రూపాయలను కోట్లాది రూపాయలను ప్రజాసేవకు ప్రజాభివృద్ధికి పేద ప్రజల సంక్షేమానికి నిరుపేదల ప్రభుత్వ వైద్యానికి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు పూర్తిస్థాయిలో సహాయపడుతూ రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాల్లో కూడా రాజకీయ సేవా అంటే ఎలా చేయాలో చేసి చూపిస్తున్నాడని అంతటి సేవా లక్ష్యాలను ప్రతి నియోజకవర్గంలోని నాయకులు పాటించినట్లయితే కాంగ్రెస్ కార్యకర్తలకు ఇంతటి తిప్పలు ఎందుకు ఏర్పడతాయి అంటూ గుర్తు చేశారు.మరోవైపు ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ అవినీతి కుంభకోణాలను అక్రమాలను ప్రభుత్వ వైఫల్యాలను ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాలను ప్రజాసేవ కలుగుతున్న విఘాతాలను పదేపదే గుర్తుచేస్తూ ప్రజల్లో గుర్తింపు పొందుతుండగా కాంగ్రెస్ పార్టీలో అత్యధికంగా దెబ్బతిన్న నిజమైన కార్యకర్తలు నిజమైన నాయకులు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ చేయుచున్న పోరాటాల వైపు ఆకర్షితులవుతున్నారని గుర్తుచేశారు.జాతీయ పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ గాని, బిజెపి పార్టీ గానీ,టిడిపి పార్టీ గాని తెలంగాణ ప్రజలకు చేస్తున్న మెరుగైన సేవలు ఎక్కువ మొత్తంలో కనబడటం లేదని భావిస్తున్న తెలంగాణ వాదులు తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న పరిపాలన విధానాలను దగ్గరగా పరిశీలిస్తూనే తెలంగాణ రాష్ట్రంలో టిడిపితో పాటు జనసేన రాజకీయ చిచ్చులు రేపుతున్న పరిస్థితులను విమర్శిస్తూ సొంత పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ పైనే వ్యతిరేకతను కనపరిచే పరిస్థితికి రాజకీయ పాలకుల తీరు చేరిపోతుందని కార్యకర్తలు భావిస్తున్నట్లుగా తెలిపారు.ప్రజల ఆశయాలకు అనుకూలంగా పనిచేయలేని నాయకులందరూ రానున్న కాలంలో ఓటమిని చవిచూడక తప్పదని పదేపదే హెచ్చరిస్తున్నప్పటికిని కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇతర పార్టీల నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వాళ్ళ వ్యాపారాలకు అడ్డస్తున్న వ్యక్తులను పోలీస్ అధికారులచే కఠినంగా శిక్షించే విధంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని అదే కోణంలో నిజమైన కార్యకర్తలు కాంగ్రెస్ మంత్రులను గాని కాంగ్రెస్ నాయకులను గాని స్వతహాగా కలుసుకొని వాళ్ల బాధలు చెప్పుకోలేని పరిస్థితిలో కోకోల్లలం కలవంటూ గుర్తుచేస్తూ ప్రజల విశ్వాసానికి కార్యకర్తల నమ్మకానికి కాంగ్రెస్ పార్టీ దూరంగా పనిచేస్తుందని ప్రజలు భావిస్తున్నట్లు కార్యకర్తలు విమర్శిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ విభేదాలు గుర్తుచేస్తున్నాయన్నారు.పార్టీలు మారినోనికే పెద్ద పీట వేస్తే అసలైన కార్యకర్తల పరిస్థితి ఏమిటనేది వాళ్ళ జీవన విధానం కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లలో బాగుపడకపోతే దేని కోసం జెండా పట్టినామనే ప్రశ్నార్థకం వాళ్ళ వాళ్ళ జీవితాలను వెంటాడుతూనే ఉంటుందని గుర్తు చేశారు.కార్యకర్తలను కాపాడుకోలేని పరిస్థితిలో కరుడుగట్టిన రాజకీయాలు నడుస్తున్నాయన్నది మాత్రం వాస్తవమన్నారు.కాంగ్రెస్ పార్టీలో ఎవరు కష్టపడుతున్నారోఎవరు సంపాదించుకుంటున్నారో ఎవరు ప్రజల పక్షాన నిలబడుతున్నారో ఎవరు ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధి చేస్తున్నారో ఒకరికొకరికి ఏమాత్రం పొంతన లేకుండా పోతుందని అలాంటి రాజకీయాల మధ్య నలిగిపోతున్నది మాత్రం ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ జెండా పట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్న సామాన్య కార్యకర్తలు సాధారణ నాయకులేనన్న సంగతి తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని గం ఘంటాపదంగా తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు**
**10 ఆర్డీవో,107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం**
**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అ÷-దదె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అ÷-దదె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# ప్రజాసేవకు ప్రతిరూపం డిఐజి విజయ్ రావు ఐపిఎస్




**పోలీస్ వృత్తిలో మార్గదర్శకత్వాన్ని కనపరుస్తున్నారు**

**ఆత్మీయ బంధాలకు చిరునామా... సేవాస్ఫూర్తికి ప్రతిరూపం... డీఐజీ విజయ్ రావు ఐపీఎస్**

**పేద ప్రజలు అంటే తనకు అమితమైన ప్రాణం**

**అధికారంలో ఎంతో ఎత్తున ఉన్న ప్రజాసేవను పక్కాగా అమలు పరుస్తున్నారు**

**ప్రజాసేవకు చిరునామా డిఐజి విజయ్ రావు ఐపీఎస్**

**డాక్టర్ బరిగెల శివ జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్**

**విజయవాడ జై భీమ్ న్యూస్:-**

అధికారం ప్రజాసేవకు అడ్డుపడదని శాంతి భద్రతల రక్షణలో మనస్ఫూర్తిగా సేవ చేయగల పోలీస్ ఉన్నతాధికారులు చరిత్రలో నిలిచిపోగలరని అలాంటి అధికారులు ప్రజాసేవ పట్ల అంతే స్థాయి అంకితభావంతో పనిచేయగలరని రాళ్ళు చాలా అరుదుగా లభిస్తారని ప్రజాసేవను బలంగా నమ్మే పోలీసు ఉన్నతాధికారులలో డిఐజి విజయ్ రావు ఐపీఎస్ ఒకరని డాక్టర్ బరిగెల శివ అభిమానించారు. 2010 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ప్రజల భద్రతను పరమ ధ్యేయంగా భావించి నిస్వార్ధ సేవతో తనదైన ముద్ర వేసుకున్న డైనమిక్ పోలీస్ ఆఫీసర్,డీఐజీ విజయరావు గారి ఆత్మీయ ఆహ్వానం మేరకు విజయవాడకు చేరుకుని వారిని మర్యాదపూర్వకంగా కలవడం నాకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని కలిగించింది. ఈ ఆత్మీయ భేటీలో ప్రజాసేవ, సమర్ధవంతమైన పోలీసింగ్, శాంతిభద్రతల పరిరక్షణ, రాజ్యాంగ విలువల అమలు, సామాజిక న్యాయం, యువతలో బాధ్యతాయుతమైన నాయకత్వం, మీడియా పాత్ర, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై సుదీర్ఘంగా, సార్థకంగా చర్చించడం జరిగింది. క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యసాహసాలు, నిష్పక్షపాత వైఖరి, మానవతా దృక్పథంతో పోలీసు సేవను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న డీఐజీ విజయరావు గారు భారత పోలీసు సేవ (ఐపీఎస్) గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న విశిష్ట అధికారి. వారి సేవా ప్రస్థానం మరిన్ని విజయ శిఖరాలను అధిరోహిస్తూ, ప్రజలకు స్ఫూర్తిదాయకంగా కొనసాగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.



# టీజీజీడీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డా. ఎ. శ్రీకృష్ణారావు ఏకగ్రీవ ఎన్నిక

**2026-2028 కాలానికి బాధ్యతలు.. వైద్య సేవలకు గుర్తింపుగా కీలక పదవి.. అభినందనల వెల్లువ**

**హన్మకొండ, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) డిప్యూటీ సివిల్ సర్జన్ డా. ఎ. శ్రీకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 2026--2028 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి ఎన్నుకోవడం వైద్య వర్గాల్లో హర్షాతిరేకాన్ని కలిగించింది. ప్రభుత్వ వైద్యుడిగా ప్రజారోగ్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో డా. శ్రీకృష్ణారావు ఎల్లప్పుడూ ముందుంటున్నారు. పరిపాలనా సామర్థ్యం, ప్రజా సేవ పట్ల నిబద్ధత, సహచర వైద్యులతో సమన్వయం, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో ఆయన పోషిస్తున్న పాత్రకు వైద్య వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రభుత్వ వైద్యుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సేవా పరిస్థితుల మెరుగుదలకు కృషి చేయడం, వైద్యుల హక్కుల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించడం వంటి అంశాలను గుర్తించిన సంఘం నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు సభ్యులు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యుల సంక్షేమం, సేవా భద్రత, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెంపు, ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దిశగా ఆయన కీలక పాత్ర పోషిస్తారనే విశ్వాసాన్ని వైద్యులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డా. ఎ. శ్రీకృష్ణారావు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వ వైద్యుల సంక్షేమం, వారి సేవా హక్కుల పరిరక్షణ, వైద్య రంగ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యులందరినీ ఒకే వేదికపై సమన్వయం చేస్తూ, ప్రజలకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించేలా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. డా. శ్రీకృష్ణారావు ఎన్నికపై హనుమకొండ జిల్లా ప్రభుత్వ వైద్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ప్రజారోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం మరింత బలోపేతం కావడంతో పాటు ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం, వైద్యుల సంక్షేమం, ప్రజారోగ్య సేవల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# 10న రైతు ఆశీర్వాద సభ

**రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం,జూలై7(జై భీమ్ న్యూస్):**

గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రబుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని తుమ్మల సూచించారు.

# నూతన సిపికి ఘన స్వాగతం

**సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పీటిసి ప్రిన్సిపాల్ కె రమేష్**

**వరంగల్ పోలీస్ శాఖలో నూతన ఉత్సాహం**




**వరంగల్ పోలీస్ శాఖ జై భీమ్ న్యూస్:-**

వరంగల్ పోలీస్ శాఖలో నూతనమైన ఉత్తేజం ఏర్పడిందని పీటిసి ప్రిన్సిపాల్ కె రమేష్ తెలిపారు.వరంగల్ మహానగరంలో మొట్టమొదటి మహిళా పోలీస్ ఐపీ ఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ ను సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తను స్పందిస్తూ వరంగల్ ప్రజలు అత్యంత అదృష్టవంతులని సిపి శ్వేతా రెడ్డి ఐపీఎస్ రూపంలో వరంగల్ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించబడబోతున్నాయని గర్వంగా చెబుతున్నామన్నారు. పిటిసి బలోపేతానికి పోలీస్ కమిషనర్ సూచనలు సలహాలు ఉన్నత స్థాయిలో పాటిస్తానని హామీ ఇచ్చారు.

# దొడ్డకన్నల్లి గ్రామ ప్రాథమిక సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ జి. పరమేశ్వర్‌కు విజ్ఞప్తి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**




కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నల్లి కృష్ణప్ప, కర్ణాటక జనందోళన సంఘటన్ అధ్యక్షుడు కృష్ణప్ప, దళిత సంఘ నాయకులు సిద్దలింగప్ప, కర్ణాటక భీమ్ సేన రాజ్య అధ్యక్షుడు శంకర్ రామలింగయ్య, రామకృష్ణ, గంగప్ప కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్‌ను కలిసి, మహాదేవపుర నియోజకవర్గ దొడ్డకన్నల్లి గ్రామంలోని సర్వే నెం. 10లో నివసిస్తున్న స్థానికులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి సమర్పించారు. దొడ్డకన్నల్లి గ్రామంలో 482 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి. గత 21 ఏళ్లుగా ఇక్కడ రోడ్లు, తాగునీరు, మురుగునీటి పారుదల, గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. జీబీఏ ( గ్రేటర్ బెంగళూరు అథారిటీ ) నుండి రూ. 8 కోట్ల గ్రాంటు మంజూరైనప్పటికీ, ఇక్కడ ఎలాంటి పనులు జరగలేదు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్‌కు విజ్ఞప్తి చేయడం జరిగింది. బెంగళూరు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మరియు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడిన తర్వాత దొడ్డకన్నల్లి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండ

**హామీ ఇచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి,జూలై7(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. అమరావతిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ అంత్రపెన్యూర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను ఆప్యాయంగా పలకరించిన పవన్ కల్యాణ్.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా విని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పారిశ్రామికవేత్తలు సబ్సిడీల విడుదలలో తీవ్ర జాప్యం, పరిశ్రమల నిర్వహణకు సంబంధించిన పలు సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం.. ఎస్సీ, ఎస్టీ అంత్రపెన్యూర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటాం. ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలతో సమీక్షించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపిస్తాం' అని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సబ్సిడీల అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని తెలిపారు. నేపథ్యంలో బుధవారం ఎంఎస్ఎంఈ, ఆర్థిక, పరిశ్రమల శాఖల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పెండింగ్ సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు పవన్ వెల్లడించారు. ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా తక్షణ కార్యాచరణ ప్రారంభిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## హైదరాబాద్‌కు బయలుదేరిన కేయూ ఉద్యమకారులు



**హన్మకొండ, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరగనున్న నేపథ్యంలో, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) ఉద్యమకారులు భారీ సంఖ్యలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ డా. చిర్ర రాజు గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నుంచి సుమారు 50 మంది విద్యార్థి ఉద్యమ నాయకులు ముందుగా హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ హైదరాబాద్‌లో జరగనున్న గుర్తింపు కమిటీ సమావేశానికి బయలుదేరారు. ఈ సందర్భంగా డా. చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ యౌవనాన్ని, విద్యార్థి జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేసిన వేలాది మంది ఉద్యమకారులకు న్యాయం జరిగే సమయం ఆసన్నమైందన్నారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి విద్యార్థి నాయకుడు, ప్రజా సంఘాల ప్రతినిధి, ఉద్యమకారుడి సేవలను ప్రభుత్వం సమగ్రంగా గుర్తించి వారికి తగిన గుర్తింపు కల్పించాలని కోరారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పోషించిన చారిత్రక పాత్రను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో జరిగే కమిటీ సమావేశంలో కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమకారుల తరఫున పలు కీలక అంశాలు, సూచనలు కమిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు ఆదర్శంగా నిలిపే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు వెన్నంపెల్లి విజయ్, బుర్రి ఉమాశంకర్, జోరిక రమేష్, సంజీవ్, సునీల్ నాయక్, కుమార్, సూరజ్ కృష్ణ, నాగరాజు పటేల్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుంజూరు,కడుగోడి ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

మహాదేవపుర నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారి అనుసంధానం, మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి నియోజకవర్గంలోని గుంజూరు, కడుగోడి ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుంజూరు క్లబ్ రోడ్డు పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం, ఆమె గుంజూరు ప్రధాన రహదారిని (రాష్ట్ర రహదారి–35) పెరిఫెరల్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే 45 మీటర్ల వెడల్పు గల సీడీపీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి మాట్లాడుతూ,"మహాదేవపుర నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. భవిష్యత్తులో వాహనాల రద్దీ, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధమైన రహదారి అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. గుంజూరు ప్రధాన రహదారిని పీఆర్ఆర్‌కు అనుసంధానించే 45 మీటర్ల సీడీపీ రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్. ఈ పని పూర్తయిన తర్వాత ట్రాఫిక్ రద్దీ తగ్గి, వేలాది మంది ప్రజలు సుఖంగా ప్రయాణించగలరు" అని అన్నారు. ఈ రహదారి పనుల వల్ల గుంజూరు, వర్తూరు, చుట్టుపక్కల ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడుతుందని, ఇది ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆమె అన్నారు. అదే సమయంలో, ఆమె కడుగోడి ప్రాంతంలోని పార్కులలో సుందరీకరణ, ల్యాండ్‌స్కేప్ అభివృద్ధి, నీటి సౌకర్యాలు, ఇతర సివిల్ పనులను ప్రారంభించారు. కాశీ విశ్వనాథ ఆలయం సమీపంలో దక్షిణ పినాకిని నదిపై వంతెన నిర్మాణాన్ని కూడా ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రోడ్డు, నీటి, పార్కు, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు హూడీ పిళ్ళప్ప, రాష్ట్ర బీజేపీ పరిషత్ సభ్యుడు ఎల్. రాజేష్, నాయకులు సురేష్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, అస్లాం పాషా, లక్ష్మీనారాయణ, అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలి**

**సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ ప్రారంభం**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



**హన్మకొండ, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా మరింత బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ సైదుల్ రెడ్డి, జిల్లా పరిషత్ అదనపు ప్రధాన కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీ ప్రసన్న, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ రామాంజనేయులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామం తన అవసరాలను గుర్తించి, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని సమగ్ర ప్రణాళికలు రూపొందించేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలన్నారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రతి సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి పూర్తి అవగాహన కల్పించాలని, గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను నిర్ణయించి పనులు చేపట్టాలని సూచించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జిల్లాల వారీగా సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## నాణ్యమైన విద్య కోసం సమీకృత ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం

### వరంగల్ జిల్లాలో 2,922 మంది ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ

**వరంగల్, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు తరగతి గది బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో మూడు రోజుల సమీకృత ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి. రంగయ్య నాయుడు తెలిపారు. జూలై 8 నుంచి దశలవారీగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరీమాబాద్ కేంద్రాల్లో "ట్రాన్స్‌ఫార్మేటివ్ క్లాస్‌రూమ్ ప్రాక్టీసెస్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్" అంశంపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని వెల్లడించారు. ప్రభుత్వ, లోకల్ బాడీ, తెలంగాణ మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,922 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాత్రం మండల స్థాయిలో ప్రత్యేకంగా శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశ శిక్షణ జూలై 8 నుంచి 10 వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల శంభునిపేటలో జరుగుతుందని తెలిపారు. ఈ దశలో ఇంగ్లీష్, హిందీ, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. చెన్నారావుపేట, దుగ్గొండి, గీసుకొండ, ఖానాపూర్, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు మాత్రమే ఈ తొలి విడత శిక్షణకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి. రంగయ్య నాయుడు సూచించారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరచడం, విద్యార్థుల్లో అభ్యాస నాణ్యతను పెంపొందించడం, ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో అమలు చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు.

## రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**హన్మకొండ, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజూను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శికి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హనుమకొండ జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాల పురోగతిపై సంక్షిప్తంగా చర్చించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజూ విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.

# మైనార్టీలను కాంగ్రెస్ మోసం చేస్తోంది..

**షాదీఖానా స్థలాన్ని వెంటనే అప్పగించాలి: బీఆర్ఎస్ నేతలు**

**హన్మకొండ, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు నయీంమొద్దీన్, దర్శన్‌సింగ్, మసూద్, మహమూద్ ఆరోపించారు. మంగళవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చొరవతో మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 2022లో న్యూశాయంపేటలోని సర్వే నంబర్ 597లో 25 గుంటల ప్రభుత్వ భూమిని మైనార్టీల కోసం షాదీఖానా నిర్మాణానికి కేటాయించారని తెలిపారు. అలాగే హజ్ హౌస్ అవసరాల కోసం వరంగల్‌లో 1,800 గజాల స్థలాన్ని కూడా కేటాయించినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మైనార్టీల కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి మైనార్టీ శాఖకు అప్పగించి, షాదీఖానా నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌ను పట్టించుకోకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే న్యూశాయంపేటలోని స్థలాన్ని తిరిగి మైనార్టీలకు అప్పగించాలని, పేద ముస్లింల కోసం షాదీఖానా నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో వేరే ప్రభుత్వ భూములు ఉండగా మైనార్టీలకు కేటాయించిన భూమినే ఎందుకు వెనక్కి తీసుకుంటున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇవ్వని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా మైనార్టీల కోసం అమలు చేసిందని తెలిపారు. మైనార్టీల కోసం 202 గురుకులాలు, మైనార్టీ కళాశాలలు, విదేశీ విద్యా సహాయం, ఇమామ్‌లు, మౌజన్‌లకు ఆర్థిక సాయం, పండుగలకు ప్రభుత్వ కానుకలు అందించడంతో పాటు మసీదులు, గురుద్వారాల నిర్మాణానికి నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. అన్ని మతాలు, కులాలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి భూములు కేటాయించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, హనుమకొండలో మైనార్టీలకు డిప్యూటీ మేయర్, లైబ్రరీ చైర్మన్, మైనార్టీ కమిషన్ సభ్యుల వంటి పదవులు దక్కేలా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి వ్యాఖ్యలను కూడా బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. దాస్యం వినయ్ భాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగితే తాము కూడా తగిన విధంగా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, ఖలీల్, ఫెరోజ్, అర్షద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత**

**హన్మకొండ, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ నెల 9న హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)లో డీసీపీ ధార కవిత, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల ఉన్నతాధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనకు సంబంధించిన ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గవర్నర్ పర్యటనలో భాగంగా ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో సమావేశమై ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. తదుపరి గవర్నర్ హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని సందర్శించి సేవా కార్యక్రమాలను పరిశీలించనున్నారు. అనంతరం పెద్దమ్మగడ్డలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలను పరిశీలించనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గవర్నర్ పర్యటించే అన్ని ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, అసిస్టెంట్ పోలీసు కమిషనర్ నర్సింహారావు, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి శేషాద్రి, రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు డా. పి. విజయచంద్రారెడ్డి, ఈవి శ్రీనివాస్ రావు, గోపాల్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మంత్రి కొండా సురేఖ ఫిర్యాదుతో కాంగ్రెస్‌లో కలకలం

**కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ**

**"ఒకరి శాఖలో మరొకరికి ఏం పని?"**

**అధికార పరిమితులు దాటుతున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైన పరిణామం చోటుచేసుకుంది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారశైలిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. దేవాదాయ శాఖకు సంబంధించిన అధికారిక అంశాల్లో శాఖా మంత్రికి సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి నేరుగా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా విధానాలకు, మంత్రివర్గ బాధ్యతలకు విరుద్ధమని మంత్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ తన లేఖలో దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, నిధుల కేటాయింపులు, దేవాలయాల నిర్వహణ, అధికారిక సమీక్షలు వంటి అంశాలు పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై దేవాలయాల అభివృద్ధి, నిధుల విడుదల, మాస్టర్ ప్లాన్లు, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు విధించడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభుత్వ రూల్స్ ఆఫ్ బిజినెస్ స్ఫూర్తిని కూడా ప్రస్తావించారు. ప్రభుత్వంలో ప్రతి శాఖకు సంబంధించిన విధాన నిర్ణయాలు, అధికారాల వినియోగం, పరిపాలనా బాధ్యతలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలని, అలాంటి వ్యవస్థను పక్కనపెట్టి ఒక ఎమ్మెల్యే అధికారిక సమీక్షలు నిర్వహించడం సరైన సంప్రదాయం కాదని అభిప్రాయపడ్డారు. ప్రజా జీవితంలో అనుభవజ్ఞుడైన ప్రజాప్రతినిధిగా ఉన్న కడియం శ్రీహరికి ఈ విషయాలు తెలిసే ఉంటాయని, అయినప్పటికీ శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టడం ఆందోళనకరమని ఆమె పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదులో కడియం శ్రీహరి వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "ఒకరి శాఖలో మరొకరు జోక్యం చేసుకోవడం ప్రభుత్వ వ్యవస్థలో సరైన పద్ధతి కాదు. ప్రతి శాఖకు ఒక మంత్రి ఉన్నప్పుడు, శాఖా మంత్రిని పక్కనపెట్టి అధికారులతో సమీక్షలు నిర్వహించడం అధికార పరిమితులను అతిక్రమించడమే" అని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. అలాగే, "కడియం శ్రీహరికి తన అధికార పరిధికి సంబంధం లేని అంశాల్లో జోక్యం చేసుకోవడం కొత్త కాదు. మొదటి నుంచే తన ఇష్టానుసారంగా వ్యవహరించడం ఆయనకు అలవాటుగా మారింది. ప్రభుత్వంలో సమిష్టి బాధ్యత అనే వ్యవస్థను విస్మరించి, తానే నిర్ణయాలు తీసుకోవాలనే ధోరణి సరికాదు" అని మంత్రి వ్యాఖ్యానించినట్లు సమాచారం. మరోవైపు, "ఒక మహిళా మంత్రిగా ఉన్న నన్ను కూడా గౌరవించకుండా శాఖా మంత్రికి కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులతో సమావేశాలు నిర్వహించడం బాధాకరం. ఇది వ్యక్తిగతంగా నన్ను అవమానించడమే కాదు, మంత్రివర్గ వ్యవస్థను కూడా అవమానించినట్లే. ఇలాంటి చర్యలు కొనసాగితే ప్రభుత్వం, పార్టీ రెండింటి ప్రతిష్ఠ దెబ్బతింటుంది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి చర్యలు ప్రభుత్వ పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. అధికారులు ఎవరి ఆదేశాలను అనుసరించాలనే విషయంలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని, దీనివల్ల ప్రభుత్వ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి కోరారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపించి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నుంచి వివరణ కోరడంతో పాటు అవసరమైతే పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని తన లేఖలో విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా చర్చకు దారితీసింది. మంత్రివర్గ బాధ్యతలు, ప్రజాప్రతినిధుల అధికారాల పరిమితులు, ప్రభుత్వ పరిపాలనా విధానాల అమలుపై ఈ ఘటన కొత్త చర్చకు తెరలేపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫిర్యాదుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? పార్టీ క్రమశిక్షణ కమిటీ ఈ అంశాన్ని పరిశీలిస్తుందా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# హసన్‌పర్తిలో పాన్ షాపులపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు






**గుట్కా, మాదకద్రవ్యాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని సీఐ ఆకునూరి మహేందర్ హెచ్చరిక**

**హసన్‌పర్తి, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టే లక్ష్యంతో మంగళవారం హసన్‌పర్తి సెంటర్‌లోని పలు పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ సీఐ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో షాపుల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు నిల్వ ఉంచారా, విక్రయిస్తున్నారా అనే అంశాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ఎ. మహేందర్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేసే గుట్కాలు, నికోటిన్ కలిగిన పొగాకు ఉత్పత్తులు, ఎలాంటి మాదకద్రవ్యాల విక్రయాన్నీ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత పదార్థాలను నిల్వ ఉంచినా, రహస్యంగా విక్రయించినా సంబంధిత షాపు యజమానులపై కేసులు నమోదు చేసి చట్టంలోని కఠినమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పాఠశాలలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో గుట్కాలు లేదా ఇతర మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఆర్పీఎస్ ఉద్యమం 32 ఏళ్ల ప్రస్థానానికి నివాళి

**సమానత్వం, సమాజహితమే ఎంఆర్పీఎస్ ఉద్యమ లక్ష్యం: కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం**



**హన్మకొండ, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ జన్మదిన వేడుకలను కాకతీయ విశ్వవిద్యాలయం మొదటి గేటు వద్ద ఘనంగా నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ సమన్వయంలో, ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ, గత 32 ఏళ్లుగా అనేక సామాజిక, మానవతా ఉద్యమాలతో తెలుగు నేలపై చెరగని ముద్ర వేసిన చరిత్ర ఎంఆర్పీఎస్‌కు ఉందన్నారు. పాలకుల కుట్రలు, ఉద్యమ ద్రోహుల వెన్నుపోట్లు, స్వార్థపరుల అడ్డంకులను అధిగమిస్తూ ఉద్యమం సజీవంగా కొనసాగడానికి మంద కృష్ణ మాదిగ సమర్థవంతమైన నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అతిపెద్ద సామాజిక ఉద్యమాల్లో ఎంఆర్పీఎస్ ఒకటేనని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సాగిన ఉద్యమం ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని, మాదిగ సమాజానికి ఆత్మగౌరవం, అస్థిత్వం, ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంలో ఉద్యమం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, హత్యలు, అత్యాచారాలకు గురైన మహిళల కోసం మానవతా దృక్పథంతో ఎన్నో పోరాటాలు చేపట్టి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. ప్రస్తుతం అనాథ పిల్లల సంక్షేమం కోసం కూడా ఉద్యమం కొనసాగుతోందన్నారు. మాదిగల హక్కుల కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం నేడు అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడుతోందని, సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించి సాంఘిక సమానత్వాన్ని సాధించడమే ఎంఆర్పీఎస్ ఉద్యమ లక్ష్యమని స్పష్టం చేశారు. గత 32 ఏళ్లుగా ఉద్యమానికి అండగా నిలిచిన మాదిగ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఎల్ఫీ రాజ్‌కుమార్, డా. పోదేటి శ్రీనివాస్, డా. సంకినేని వెంకట్ మాదిగ, డా. జూల సత్యం మాదిగ, బొచ్చు తిరుపతి మాదిగ, మంద భాస్కర్, డా. వడ్డేపల్లి మోహన్, డా. కొత్తపల్లి నాగేశ్వరరావు మాదిగ, డా. వడ్డేపల్లి మధుకర్ మాదిగ, విద్యార్థి సంఘాల నాయకులు, ఎంఎస్ఎఫ్ నాయకులు, మహిళా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి అవకాశాలు

**అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**వరంగల్, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా శాయంపేట గ్రామం, గీసుగొండ మండలంలో ఏర్పాటు చేయబడిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పరిధిలోని టెక్స్‌టైల్ సంస్థల్లో టైలరింగ్ వృత్తిలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, పార్కు ఏర్పాటులో భూమి కోల్పోయిన భూనిర్వాసితులతో పాటు సంగెం, గీసుగొండ మండలాల ప్రజలు, అలాగే వరంగల్ జిల్లా ప్రజలు టైలరింగ్‌లో నైపుణ్యం కలిగి ఉండి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు సంగెం లేదా గీసుగొండ తహసీల్దార్ కార్యాలయాల్లో, లేదా డి.ఆర్.డి.ఓ, వరంగల్ కార్యాలయంలో, అలాగే ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ ఆధ్వర్యంలోని ప్రత్యేక డెస్క్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ ప్రాజెక్టు కింద భూమి కోల్పోయిన భూనిర్వాసితులు స్వయం ఉపాధి పొందేందుకు ఆసక్తి చూపుతున్నట్లయితే వారు కూడా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కోరారు.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

**న్యూఢిల్లీ,జూలై7(జై భీమ్ న్యూస్) :**

పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

**కెసిఆర్ సరేనంటే..ఎంత సమయమైనా కేటాయిస్తాం**
**కెసిఆర్ వాదన సరైనదయితే ..ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం**
**కాళేశ్వరం కమిషన్ల ప్రాజెక్ట్ అన్న సిఎం రేవంత్ రెడ్డి**
**నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు**
**కెటిఆర్, హరీష్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని విమర్శలు**
**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సిఎం రేవంత్ విమర్శలు**

**హైదరాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్):**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరుపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాప్కోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్దాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్దాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు. అబద్దాల రావుల మాటలను నాటి గవర్నర్ నమ్మారని రేవంత్ చెప్పుకొచ్చారు. డబ్బులు కొల్లగొట్టాలన్న ఆశతో ప్రాజెక్టును ప్రారంభించారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకొచ్చి యజ్ఞాలు చేశారని విమర్శించారు. కట్టిన ఏడాదిలోపే మేడిగడ్డ కుంగిపోయిందని, నాటి ప్రాజెక్టు ఏఈనే లోపాలను బయటపెట్టారన్నారు. సమస్యను గుర్తించకపోవడం వల్లే కూలిపోయిందని, 2022లో వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందన్నారు. 2023 అక్టోబర్‌లో ఆరు పిల్లర్లు కూలిపోయాయని, బ్యారేజీలు, డ్యామ్‌లు కడితే 25 శాతం చొప్పున నింపుతారని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదికే బ్యారేజీలను నింపేశారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, మేడిగడ్డను చూపించి బంగాళాఖాతాన్ని తెచ్చినట్టు చేశారన్నారు. నీళ్లు నింపడం వల్ల బ్యారేజీలపై ఒత్తిడి ఎక్కువైందని, ఇసుక మీదనే బ్యారేజీలు కట్టడం వల్ల ప్రాజెక్టు కుంగిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, పిల్లలదే కీలక పాత్ర

**మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని**
**గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం**
**నాచారంలో బాలామృతం ప్లాంట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ సమాజ అభివృద్ధిలో మహిళలు, పిల్లల పాత్రే అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. నాచారంలో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన బాలామృతం ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గర్భిణీల నుంచి పిల్లలకు 6 ఏళ్లు వచ్చే వరకు పౌష్టికాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ స్కూళ్లలోనే టీచర్లు కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఇక్కడ తయారు చేసే బాలమృతం ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే విధంగా ప్లాంట్ రూపొందిందని అన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్లపాటు బాలామృతం పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా ఈ ఎ÷-లాంట్ అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలకు ఓట్లు లేకపోయినా.. వారి భవిష్యత్ పట్ల తమ ప్రభుత్వానికి శ్రద్ధ ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళల సంక్షేమంపై మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, దీనివల్ల పనిచేసే మహిళలకు నెలకు 10 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తున్నామని.. త్వరలోనే హైదరాబాద్ సిటీలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు పంచుతామని సీఎం భరోసా ఇచ్చారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇకపోతే రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. తయారీ వివరాలను అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ద్వారా గంటకు 18 టన్నుల బాలామృతం తయారు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. మరోవైపు త్వరలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని సీఎం చెప్పారు. 'ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5లక్షల ఇళ్లు కట్టాం. పట్టణాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. విద్యార్థుల కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాజకీయాలకతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటా అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

**నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు**
**మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమటి**
**సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్) :**

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

# ప్రధాని మోడీకి అరుదైన గౌరవం

**ఇండోనేషియా అత్యున్నత పురస్కారం**

**న్యూఢిల్లీ,జూలై7(జై భీమ్ న్యూస్) :**

భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా దేశం తమ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా'అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ అందించిన విశేష కృషికి గుర్తింపుగా ఇండోనేసియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఈ అత్యున్నత పురస్కారాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్-ఇండోనేసియా దేశాల మధ్య చారిత్రక బంధాన్ని కొత్త శిఖరాలకు చేర్చడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) ప్రయోజనాల కోసం, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం భారత్ అందిస్తున్న సహకారం అమోఘమైనదని ఆయన ప్రశంసించారు.

# హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మారనున్న రూపురేఖలు

**గతంలో ఎప్పడూ లేనంతగా రోడ్ల నిర్మాణాలు**
**గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం**
**రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల సిఎం హ్యా రోడ్లకు శంకుస్థాపన చేయడంతో రాష్ట్ర్ర రోడ్ల స్వరూపం మారబోతోందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని.. గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోమీటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే హైదరాబాద్ రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోమీటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల (4-ఒజీని) రహదారుల నిర్మాణం ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా, ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని.. ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి వెంకట్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

# కాక్రోచ్ పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించండి

**కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీ,జూలై7(జై భీమ్ న్యూస్):**

కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని దిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నీట్ పేపర్ లీక్, రీ-టెస్ట్ సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులలో గందరగోళం సృష్టించే అవకాశం ఉందనే కారణంతో ఆ పార్టీ ఎక్స్ ఖాతాపై నిషేధం విధించినట్లు కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి తెలిపారు. నీట్ పరీక్ష ఇప్పటికే ముగిసినందున.. నిషేధం తొలగించాలని కోర్టు ఆదేశించింది. తమ పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక పొలిటికల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన వారం రోజుల్లోనే తమ 'ఎక్స్' ఖాతాను నిలిపివేశారని దీప్కే పిటిషన్‌లో తెలిపారు. నిలిపివేసే సమయానికి ఆ ఖాతాకు దాదాపు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. సీజేపీ పేరిట వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**
**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**
**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**అహ్మదాబాద్,జూలై7(జై భీమ్ న్యూస్) :**

దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# పోలీసులకు నైపుణ్యమే బలం





**విధుల్లో ప్రతిభ కనబర్చాలంటే నిరంతర శిక్షణ అవసరమన్న సీపీ ఎన్. శ్వేత**

**వరంగల్‌లో భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌కు ఘన ప్రారంభం**

**నాలుగు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనడం**

**సాంకేతిక, ఫోరెన్సిక్ విభాగాల్లో నైపుణ్యాల ప్రదర్శన**

**రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు ఉత్తమ ప్రతిభావంతుల ఎంపిక**

**వరంగల్, జూలై 7 (జై భీమ్ న్యూస్) :**

పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యంత అవసరమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పేర్కొన్నారు. మంగళవారం మామునూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌ను ఆమె ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది ఈ డ్యూటీ మీట్‌లో పాల్గొంటున్నారు. ఇందులో కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్ అండ్ హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఏడాది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బందిలో సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు నైపుణ్యాలు, శాస్త్రీయ ఆధారాల సేకరణలో ప్రావీణ్యాన్ని పెంపొందించే ఉత్తమ వేదికగా నిలుస్తాయని అన్నారు. ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నేరాలను వేగంగా ఛేదించడంతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు బాలస్వామి, శ్రీనివాస్, జోనల్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# శాఖా సమీక్ష వివాదం..

**సీఎంను ఆశ్రయించిన మంత్రి సురేఖ**

**శాఖా మంత్రికి సమాచారం ఇవ్వకుండా సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు**

**హైద్రాబాద్, 7 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన అధికారిక సమీక్షను శాఖా మంత్రికి సమాచారం ఇవ్వకుండా నిర్వహించారంటూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. మంత్రి కొండా సురేఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ వంటి అంశాలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. అయినప్పటికీ, శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశమై పలు అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా విధానాలకు విరుద్ధమని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. సమీక్ష సమావేశంలో దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై చర్చించి ఆదేశాలు ఇవ్వడం రూల్స్ అఫ్ బిజినెస్ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. శాఖా పరిపాలనకు సంబంధించిన అధికారిక నిర్ణయాలు సంబంధిత మంత్రి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రిని పక్కనపెట్టి సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా అధికార యంత్రాంగంలో అయోమయానికి కారణమయ్యే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరణ కోరడంతో పాటు, పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదు లేఖలో విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.




# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలి

**కాజీపేటలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ, 7 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయ్ బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కాజీపేట పట్టణంలోని డీజిల్ కాలనీ, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. వార్డుల వారీగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, నింపిన ఫారాల సేకరణ, డిజిటలీకరణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడిన కలెక్టర్, ఫారాల పంపిణీ, నమోదు పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నింపిన ఫారాలను సకాలంలో సేకరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు సమయంలో పూర్తి ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఫారాలు నింపే క్రమంలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) స్వయంగా బాధ్యత తీసుకుని ఓటర్ల నుంచి సరైన సమాచారాన్ని సేకరించి ఫారాలను పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసి డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించిన కలెక్టర్, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మొత్తం ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కాజీపేట తహసీల్దార్ రాజు, బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టెక్కీ రాధాగాయత్రి మృతి కేసు

**మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశం**

**విశాఖపట్నం,జూలై7(జై భీమ్ న్యూస్) :**

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధాగాయత్రి తన భర్తతో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి ట్రిప్‌నకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే రాధాగాయత్రి మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీచరణ్ కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే, ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి నిజానిజాలు వెలికితీసేందుకు డెహ్రాడూన్ జిల్లా కలెక్టర్ రాహుల్ ఆనంద్ మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. ఈ నిర్ణయంతో కేసు దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. మసూరిలో జూన్ 14వ తేదీ నుంచి 16వ తేదీల మధ్య అసలు ఏం జరిగిందనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణను మసూరి డివిజనల్ మేజిస్ట్రేట్ నిర్వహిస్తున్నారు. రాధాగాయత్రి మరణానికి దారితీసిన పరిస్థితులు, ఆమె మృతికి ముందు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా రాధాగాయత్రి మృతికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆమె ఆరోగ్య పరిస్థితి, ప్రయాణ వివరాలు, ఘటన జరిగిన సమయంలో ఆమెతో ఉన్న వ్యక్తులు, ఆస్పత్రి రికార్డులు తదితర అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. లాగే రాధాగాయత్రి తల్లిదండ్రులు అక్కడికి చేరుకునేలోపే పోస్టుమార్టం నిర్వహించారనే ఆరోపణలు కూడా ఇప్పుడు విచారణలో కీలక అంశంగా మారాయి. ఈ నేపథ్యంలో పోస్టుమార్టం ప్రక్రియలో పాల్గొన్న వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులను ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిర్వహణకు అనుసరించిన విధివిధానాలు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన తీరు వంటి అంశాలను కూడా పరిశీలించనున్నారు. ఈ కేసు ప్రారంభం నుంచే పలు అనుమానాలకు తావిచ్చిన నేపథ్యంలో మజిస్టీరియల్ విచారణకు ఆదేశాలు జారీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేసు విచారణ పూర్తయిన అనంతరం రాధాగాయత్రి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రాధాగాయత్రి కుటుంబ సభ్యులు కూడా ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజాలను బయటపెట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ కేసు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరాఖండ్‌లోనూ చర్చనీయాంశంగా మారింది.

# రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

**పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోడీ**

**మోడీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు**

**మిత్రలు మధ్య కాపీరైట్ ఉండదంటూ మోడీ చమత్కారం**

**న్యూఢిల్లీ,జూలై7(జై భీమ్ న్యూస్) :**

రామాయణ కాలం నుంచి భారత్–ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అనుసరించే పద్ధతులను తాము కూడా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు.ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

**న్యూఢిల్లీ,జూలై7(జై భీమ్ న్యూస్) :**

పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ర కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్...ఎన్టీఆర్



ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.

## చిత్రసీమలో ప్రతిభ ఉంటేనే రాణిస్తారు: రవిశంకర్

టాలీవుడ్‌లో నెపోటిజం అంశంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అధినేతల్లో ఒకరైన వై. రవిశంకర్ ఈ విషయంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇటీవల జరిగిన 'రాజా ది రాజా' చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర హీరో రిత్విక్‌ను ఉద్దేశించి వేదికపై రవిశంకర్ మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో రాణించాలంటే బ్యాక్‌గ్రౌండ్ కంటే సొంత ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలోకి ఎవరైనా గోల్డెన్ స్పూన్ లేదా డైమండ్ స్పూన్‌తో పుట్టి రావచ్చు కానీ ఇక్కడ అవేమీ పని చేయవని, మిమ్మల్ని నిలబెట్టేది కేవలం మీలో ఉన్న ప్రతిభ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. మన వెనుక ఎవరి అండా లేదని భావించి కష్టపడి ముందుకు సాగినప్పుడే నిజమైన విజయం దక్కుతుందంటూ హీరో రిత్విక్‌ను ప్రోత్సహిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రవిశంకర్ చేసిన ఈ కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నరేష్, వైశాఖ ధీమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

## సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

### ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ




ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

## హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి – బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




# నా అందాలు దాచేసుకున్నా




### నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి

గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి – పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.